

వేణుగోపాల్‌తో భేటీ అయిన కవిత

వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్‌తో కవిత భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ మేధావులతో జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత వరసగా సమావేశాలవుతున్నారు. ఈ నెల 25 నుంచి నిర్వహించనున్న జాగృతి జనంబాట కార్యక్రమం ప్రారంభానికి ముందు మేధావులను కలిసి వారి సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లో వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రజలెదుర్కొంటున్న సమస్యలు, క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను చర్చించారు.



ప్రమాదంలో మృతిచెందిన మల్లయ్య

కారును ఢీ కొట్టిన బైక్

- ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని కొండన్నపల్లి గ్రామ బస్‌స్టేజీ వద్ద కారు, బైక్ ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు, గంగాధర్ ఎస్‌ఐ వంశీకృష్ణ కథనం ప్రకారం... గంగాధర్ మండలంలోని కొండన్నపల్లి బస్ స్టేజి వద్ద మంగళవారం ఉదయం వేగంగా వచ్చిన బైక్ కారును వెనుక నుంచి ఢీకొట్టడంతో కారు అదుపుతప్పి చెట్టును గుద్దుకుంది. ఈ ఘటనలో కారును నడుపుతున్న తొర్రికొండ మల్లయ్య (55), బైక్‌పై వెళ్తున్న ఇమ్రాన్ షా (30) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారులో ప్రయాణిస్తున్న మల్లయ్య భార్య విమల, అతని మేనత్త కనుకవ్వ స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వంశీకృష్ణ తెలిపారు.

జనజీవనంలో కలవండి

- ప్రజాస్వామ్యయుతంగా పనులు చేసుకోండి
- మావోయిస్టులకు సిఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- బలిమెలలో మరణించిన 32 మంది పోలీసులకు 200 గజాల స్థలం
- పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో సిఎం రేవంత్ ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనజీవన స్రవంతిలో కలిసి తాము సాధించాలనుకున్న పనులను ప్రజాస్వామ్యయుతంగా నెరవేర్చుకోవాలని మావోయిస్టులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం గోషామహల్ పోలీస్ స్టేడియంలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ (బ్లాక్ డే) సభకు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టులు అనుసరిస్తున్న మార్గానికి భవిష్యత్ లేదని, ఇప్పటికే అగ్రనేతలు కొందరు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారని అన్నారు. మిగతావారు కూడా ఆ బాటలో నడిచి ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో తమ భవిష్యత్‌ను నిర్మించుకోవాలని అన్నారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటి వరకు 191 మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారనీ, రాష్ట్రానికి చెందిన ఎస్‌ఐ బానోత్ జవహర్‌తో పాటు కానిస్టేబుళ్లు సందీప్, శ్రీధర్, పవన్‌కళ్యాణ్, సైదులు, ప్రమోద్‌లు అమరులయ్యారని, వారి త్యాగాలు ఎనలేనివని ఆయన కొనియాడారు. వారికి శ్రద్ధాంజలి ఘటించారు. విధి నిర్వహణలో మరణించిన కానిస్టేబుల్ నుంచి ఎఎస్‌ఐ వరకు కోటి రూపాయలు, ఎస్‌ఐ నుంచి సిఐ వరకు రూ.1.20 కోట్లు, డిఎస్‌పి నుంచి అడిషనల్ ఎస్‌పి వరకు రూ.1.50 కోట్లు, ఎస్‌పి నుంచి ఆ పైస్థాయి వరకు రూ. రెండు కోట్లను నష్టపరిహారంగా ప్రభుత్వం చెల్లిస్తున్నదని, అలాగే వారి కుటుంబసభ్యులో ఒకరికి ఉద్యోగం, 300 గజాల స్థలాన్ని కూడా ఇవ్వడం జరుగుతున్నదని సిఎం తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాల అదుపునకు కృషి చేస్తున్న పోలీసుల సంక్షేమం పట్ల ప్రభుత్వం అన్ని విధాలా చేయూతనిస్తున్నదని ఆయన చెప్పారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, సైబర్ నేరాలు, డ్రగ్స్ మాఫియా మొదలుకొని మత కలహాలను అదుపు చేయడంలో పోలీసులు రేయింబవళ్లు కృషి చేస్తున్నారని, వారు అందిస్తున్న సేవలకు ప్రజలకు కూడా తగిన గుర్తింపును ఇవ్వాలని రేవంత్ రెడ్డి అన్నారు.



పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో సిఎం

2009లో ఆంధ్రప్రదేశ్‌లోని బలిమెల రిజర్వాయర్‌లో మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో మృతి చెందిన 32 మంది పోలీసులకు కూడా తమ ప్రభుత్వం గాజులరామారంలో ఒక్కొక్కరికి 200 గజాల భూమిని కేటాయిస్తు తాజాగా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. వారికి నష్టపరిహారం చెల్లించడంలో గత ప్రభుత్వాలు తగిన నిర్ణయం తీసుకోలేదని ఆయన అన్నారు. పెరిగిపోతున్న సైబర్ నేరాలను అరికట్టడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలనిస్తున్నాయని అన్నారు. మరోవైపు డ్రగ్స్ మాఫియాను కట్టడి చేయడానికి ఈగల్ ఫోర్స్ సైతం చేస్తున్న కృషి కూడా ఫలిస్తున్నదని రేవంత్‌రెడ్డి మెచ్చుకున్నారు.

చట్టాలను గౌరవించేవారి పట్ల ఫ్రెండ్లీగా, అతిక్రమించేవారి పట్ల కఠినంగా పోలీసులు వ్యవహరిస్తారనే సందేశాన్ని పోలీసులు సమాజంలోకి పంపించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెద్ద ఎత్తున రావడానికి శాంతి భద్రతలే ప్రధాన కారణమని, దాని పరిరక్షణలో పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని సిఎం చెప్పారు. దేశంలోనే శాంతి భద్రతల పరిరక్షణలో రాష్ట్ర పోలీసులు మొదటి స్థానంలో ఉండడం గర్వకారణమన్నారు. పోలీస్ శాఖలో మహిళలను ప్రోత్సహిస్తూ మహిళా ఐపిఎస్ అధికారులు పలువురికి కీలకమైన బాధ్యతలను అప్పగించడం జరిగిందని, మూడు ప్రధాన పోలీస్ కమిషనరేట్లలో ఏడుగురు మహిళా ఐపిఎస్ అధికారులు డిసిపి బాధ్యతలను నిర్వహిస్తున్నారని ఆయన సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ శాఖను మరింత పటిష్టం చేయడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

మావోయిస్టుల ముందున్న మార్గం లొంగిపోవడమే : డిజిపి శివధర్‌రెడ్డి

రాష్ట్ర డిజిపి బత్తుల శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ శాఖను మరింతగా చేరువ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అమరులైన పోలీస్‌లకు ఆయన శ్రద్ధాంజలి ఘటిస్తూ.. వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర పోలీస్ శాఖ మరింత స్ఫూర్తిదాయకంగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో కత్తిపోట్లకు గురై మరణించిన కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి పూర్తిగా అండగా నిలుస్తామని డిజిపి చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో దేశంలోనే ప్రఖ్యాతిని గడించిన రాష్ట్ర పోలీస్ శాఖ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మరింత ఇనుమడించిన శక్తితో పని చేస్తున్నదని ఆయన తెలిపారు. మావోయిస్టులకు రాష్ట్రంలో తమ కార్యాలాపాలను కొనసాగించే పరిస్థితులు లేవని, లొంగిపోవడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు.

'పోలీస్ అమరులు వీరు' పుస్తకాన్ని ఆవిష్కరించిన సిఎం

అనంతరం 'పోలీస్ అమరులు వీరు' అనే పుస్తకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. తర్వాత ఆ ప్రాంగణంలోని నూతనంగా నిర్మించిన పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాన్ని ఉంచి ముఖ్యమంత్రి శ్రద్ధాంజలి ఘటించారు. వీరితో పాటు ప్రిన్సిపల్ సెక్రెటరీ (హెూం) సి.వి ఆనంద్, డిజిపి శివధర్‌రెడ్డి, పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు, మాజీ డిజిపిలు కూడా అమరవీరుల స్థూపం వద్ద పుష్ప గుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. అదే ప్రాంగణంలో ఈ ఏడాది విధి నిర్వహణలో మరణించిన రాష్ట్రానికి చెందిన ఆరుగురు పోలీసుల కుటుంబ సభ్యులను ఎస్‌ఐబి డిజి సుమతి ముఖ్యమంత్రికి పరిచయం చేయగా వారిని ఆయన పరామర్శించి ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

50 మందికిపైగా గాయాలు

- సరోజిని ఆస్పత్రిలో చికిత్స

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దీపావళి పండుగను పురస్కరించుకుని టపాసులు కాల్చే క్రమంలో దురదృష్టవశాత్తు పలువురు గాయాలపాలయ్యారు. దీంతో సోమవారం రాత్రి నుంచి నగరంలోని సరోజిని ఆస్పత్రికి గాయాలతో బాధితులు క్యూ కట్టారు. సోమ, మంగళవారాల్లో దాదాపు 50 మందికిపైగా బాధితులు ఆస్పత్రిలో చికిత్స కోసం చేరినట్టు వైద్యులు తెలిపారు. వీరిలో 18 మంది వరకు చిన్నారులుండగా బాధితుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. మిగిలిన వారిలో ఎక్కువ మందికి అవుట్ పేషెంట్‌గా చికిత్సనందించి పంపించారు. టపాసులు చేతిలో పేలడం, కళ్లలో ముక్కలు పడటం వంటి గాయాలయ్యాయని వైద్యులు తెలిపారు. దీపావళి పండుగ నేపథ్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించిన సంగతి తెలిసిందే. దీంతో సోమవారం రాత్రి నుంచే ఆస్పత్రిలో అత్యవసర చికిత్స కోసం వచ్చిన వారి కోసం ఏర్పాట్లను సిద్ధం చేసి ఉంచారు. బాధితుల సంఖ్య మరింత పెరగవచ్చని వైద్యులు వెల్లడించారు.

గ్రూప్-2 అభ్యర్థులకు నియామక పత్రాలు

- మంత్రి అడ్లూరి అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గ్రూప్ 2 పోటీ పరీక్షల్లో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారులుగా నియమితులైన అభ్యర్థులకు మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నియామక పత్రాలు ఆయన అందజేశారు. సిఎం అవలంబిస్తున్న ఫ్రెండ్లీ గవర్నమెంట్ పరిపాలనకు అనుగుణంగా ఉద్యోగులు పని చేయాలని ఉద్యోగులకు సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల సంక్షేమ కోసం పట్టుదలతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి శ్రమిస్తేనే ఈ స్థాయికి వచ్చారని, అందువల్ల భవిష్యత్ తరాలకు మెరుగైన విద్యను అందించాలని వారికి సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీం (బిఎఎస్) పథకానికి సంబంధించిన 25 శాతం నిధులను ఇప్పించటం అభినందనీయమన్నారు. హాస్టల్ విద్యార్థులకు 40 శాతం చార్జీలను 200 శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెంచిన ఘనత సిఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే గంద్ర సత్యనారాయణ, ఎస్‌సిడిడి సెక్రెటరీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఎస్‌సిడిడి స్పెషల్ చీఫ్ సెక్రటరీ సభ్యసాచి గోష్, ఎస్‌సిడిడి కమిషనర్ కార్యాలయ అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు

మత్స్యకారులకు రూ.5 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలి

- తెలంగాణ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నర్సింహ్మా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత్స్యకారులకు రూ.5 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ మత్స్యకారులు మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మత్స్యకార్మిక సంఘం 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం రైతుబజార్ చేపల మార్కెట్ వద్ద తెలంగాణ మత్స్యకారులు సంఘం జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అక్టోబర్ 23న సంఘం సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక, ఉమ్మడి రాష్ట్రంలో మత్స్యకారుల సమస్యలపై సంఘం అనేక రాజీలేని పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలు సాధించిందని గుర్తు చేశారు. ఇంకా ఎన్నో సమస్యలున్నాయని, వాటిని పోరాడి సాధించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రంలో 8 లక్షల కుటుంబాలు, దేశంలో 3 కోట్ల కుటుంబాలు మత్స్య వృత్తిపై ప్రత్యక్షంగా ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధికి నిధుల కేటాయింపు, వృత్తి రక్షణ, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి మత్స్య సొసైటీ బ్యాంకు అకౌంట్‌లో ప్రభుత్వం రూ.10 లక్షలు జమ చేయాలని డిమాండ్ చేశారు. పట్టణీకరణ, పారిశ్రామీకరణ వల్ల జలవనరులు, చెరువులు, కుంటలు కబ్జాలు, కాలుష్యానికి గురవుతున్నాయని, ఫలితంగా మత్స్యకారులు వృత్తికి, ఉపాధికి దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లి దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. ఇప్పటివరకు సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకొని.. మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం మరిన్ని పోరాటాలు చేసి పాలకులపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యాచరణతో ముందుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సౌళ్ల లలిత, తడబోయన కృష్ణమూర్తి, పర్రె చంద్రయ్య, పర్రె సునీత చెక్క కుమారి, చెక్క కృష్ణమూర్తి, అంకర్ల గంగ, కొనింటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న గోరెంకల నర్సింహ్మా

అత్యధిక గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించిన విద్యార్థి శివాలి

- మొత్తం 21 గిన్నిస్ రికార్డులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిని శివాలి జోహ్రి శ్రీవాస్తవ (స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, 2016-2020 బ్యాచ్ సిఎస్‌ఇ) ఆమె తల్లిదండ్రులు కవితా జోహ్రి, శ్రీవాస్తవతో కలిసి ప్రపంచంలోనే అతిపెద్ద ఓరిగామి ప్రదర్శన (కాగితంతో కళాకృతులు) చేసింది. దాంతో రెండు సరికొత్త గిన్నిస్ వరల్డ్ రికార్డులను సాధించారు. ఈ తాజా విజయంతో శివాలి మొత్తం 21 గిన్నిస్ వరల్డ్ రికార్డులకు చేరుకుని, దేశంలో అత్యధిక సంఖ్యలో గిన్నిస్ రికార్డులు కలిగి ఉన్న వ్యక్తిగా ఆమె నిలిచారు. గతంలో శివాలి 19 గిన్నిస్ రికార్డులు సాధించారు. వాటిలో 1,251 చేతితో తయారు చేసిన కాగితపు బొమ్మలు, 7,011 క్విల్డ్ పువ్వులు, 2,111 పేపర్ క్విల్డ్ బొమ్మలు, 3,501 ఓరిగామి తిమింగలాలు, 2,100 పెంగ్విన్లు, 6,132 సిట్రస్ పండ్లు, 6,001 తిమింగలాలు, 2,500 పెంగ్విన్లు, 1,993 మాపుల్ ఆకులు, 6,500 గబ్బిలాలు, 5,500 కార్లు, 3,400 డైనోసార్లు, 1,900 కుక్కలు, 3,400 నెమళ్లు, 3,200 పందులు, 4,400 చొక్కాలు, 2,200 క్విల్డ్ బొమ్మలు, 3,200 సీల్స్, 3,400 రిబ్బన్ టైలు ఉన్నాయి. ఇవేగాక, 15 అసిస్ట్ వరల్డ్ రికార్డులు, నాలుగు యూనిక్ వరల్డ్ రికార్డులను కూడా శివాలి సాధించారు. గీతం యూనివర్సిటీ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డిఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, గణిత శాస్త్ర ఆచార్యులు డాక్టర్ డి.మల్లికార్జున్ రెడ్డి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు శివాలి విజయాలను ప్రశంసించారు.

ఫార్మసీ కోర్సుల్లో 10,595 మందికి సీట్ల కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి బి ఫార్మసీ, ఫార్మా-డి, బయోటెక్నాలజీ, బయోమెడికల్ ఇంజనీరింగ్, ఫార్మాసూటికల్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎప్‌సెట్ బైపిసి విద్యార్థుల కౌన్సెలింగ్ ప్రక్రియలో సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఎప్‌సెట్‌లో 71,309 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. వారిలో ధ్రువపత్రాల పరిశీలనకు 16,336 మంది హాజరయ్యారని వివరించారు. 15,192 మంది వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని పేర్కొన్నారు. ఫార్మసీ కోర్సుల్లో 10,960 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తుది విడతలో 10,595 (96.67 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. 365 (3.33 శాతం) సీట్లు మిగిలిపోయాయని వివరించారు. 124 బి ఫార్మసీ కాలేజీల్లో 8,908 సీట్లుంటే, 8,175 మందికి సీట్లు కేటాయించామని, 348 సీట్లు మిగిలాయని తెలిపారు. 74 ఫార్మాడీ కాలేజీల్లో 1,682 సీట్లుండగా, 1,671 మందికి సీట్లు కేటాయించామని, 11 సీట్లు మిగిలిపోయాయని పేర్కొన్నారు. రెండు బయోమెడికల్ ఇంజనీరింగ్ కాలేజీల్లో 49 సీట్లుంటే, అందరికీ సీట్లు కేటాయించామని వివరించారు. మూడు ఫార్మాసూటికల్ ఇంజనీరింగ్ కాలేజీల్లో 116 సీట్లుండగా, 110 మందికి సీట్లు కేటాయించామని, ఇంకా ఆరు సీట్లు మిగిలాయని తెలిపారు. ఐదు బయోటెక్నాలజీ కాలేజీల్లో 205 సీట్లుంటే, అందరికీ సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసేందుకు గడువు బుధవారం వరకు ఉందని తెలిపారు. కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేసేందుకు గడువు ఈనెల 23 వరకు ఉందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలను కాలేజీల్లో సమర్పించాలని సూచించారు. ఇతర వివరాల కోసం https://tgeapcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

పత్తి రైతులను ఆదుకునేందుకు పటిష్ట కార్యాచరణ

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్తి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంత్రివర్యులు, తిరుమలాయపాలెం మండలం గోల్ తండ గ్రామంలోని శ్రీ భాగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్ లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సంచాలకులు జి. లక్ష్మీ బాయి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లిమంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూలి ప్రస్తుత వానాకాలం సీజన్ 2025లో మొట్టమొదటి సిసిఐ కేంద్రం పాలేరు నియోజకవర్గం తిరుమలయపాలెం మండలంలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుత సీజన్ లో అతి భారీ వర్షాలు పడిన కారణంగా రైతులకు దిగుబడి తగ్గిపోయిందని అన్నారు. పత్తి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిసిఐ ద్వారా మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు. రైతులకు పత్తి పై మద్దతు ధర గిట్టుబాటు అవడం లేదని, దీనిపై పత్తి పంట మద్దతు ధర పెంచాలని రాబోయే పార్లమెంటు సెషన్ లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో సమన్వయం చేసుకుంటూ పత్తికి మద్దతు ధర పెంచే విషయం చర్చను లేవదీసి, పత్తి మద్దతు ధర పెంపుకు కృషి చేస్తామని అన్నారు. ప్రతి వ్యవసాయ అధికారి వద్ద తేమ యంత్రాలు ఏర్పాటు చేశామని అన్నారు.

బిఆర్ఎస్ స్టార్ క్యాంపెయినర్లు 40 మంది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరోజూబ్లీహిల్స్

ఉప ఎన్నిక ప్రచారం కోసం బిఆర్ఎస్ 40 మంది స్టార్ క్యాంపెయినర్ల జాబితాను మంగళవారం విడుదల చేసింది. పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు, మాజీ మంత్రులు కెటిఆర్, టి.హరీష్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, వి.ప్రశాంత్‌రెడ్డి, జి.జగదీష్‌రెడ్డి, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, ఎస్.నిరంజన్‌రెడ్డి మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావు, చామకూర మల్లారెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్ ఉన్నారు. మాజీ ఉప సభాపతులు టి.పద్మారావు గౌడ్, పద్మా దేవేందర్ రెడ్డితో పాటు, ఎమ్మెల్యేలు ఎం.కృష్ణారావు, కె.పి.వివేకానందగౌడ్, డి.సుధీర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేష్, పాడి కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, అనిల్ జాదవ్, బండారు లక్ష్మా రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ముఠా గోపాల్, చింతా ప్రభాకర్ స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఉన్నారు. ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, శంబీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తాత మధుసూధన్, ఎల్. రమణ, తక్కెలపల్లి రవీందర్ రావు ఉన్నారు. ఎంపిలు వద్దిరాజు రవి చంద్ర, మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్ రెడ్డి, షకీల్ అమీర్ మొహమ్మద్, మాజీ చైర్మెన్ రావుల శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్, షేక్ అబ్దుల్లా సోహైల్ ఉన్నారు.

ప్రమోద్ మరణం.. పోలీస్‌శాఖకు తీరని లోటు

- కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటాం : డిజిపి బి శివధర్‌రెడ్డి
- ప్రభుత్వం తరపున రూ.కోటి ఎక్స్‌గ్రేషియా
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, 300 గజాల ఇంటిస్థలం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అందరితో కలవిడిగా ఉంటూ విధులు నిర్వర్తించే సిసిఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌కుమార్ మృతి పోలీస్ శాఖకు తీరని లోటని డిజిపి బి శివధర్‌రెడ్డి అన్నారు. నిందితుడి దాడిలో మృతిచెందిన ఆయన కుటుంబానికి ప్రభుత్వం, పోలీసు శాఖ అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. మల్టీజోన్ ఐజి ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి తదితరులతో కలిసి డిజిపి మంగళవారం నిజామాబాద్‌లోని కానిస్టేబుల్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ఆదేశాల మేరకు తాను ఇక్కడకు వచ్చానని వెల్లడించారు. కానిస్టేబుల్ ప్రమోద్‌కుమార్ హత్య దురదృష్టకరమని చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియాతోపాటు 300 గజాల ఇంటి స్థలం, పెన్షన్, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని ప్రకటించిందని తెలిపారు. వీటితో పాటు పిల్లల బాగోగులు చూసుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తన ప్రాణానికి తెగించి కానిస్టేబుల్ హత్య నిందితుడైన రియాజ్‌ను పట్టించిన ఆసిఫ్ తెగువను ఈ సందర్భంగా డిజిపి ప్రశంసించారు. ఈ క్రమంలో గాయపడిన ఆయనకు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స చేయిచేస్తున్నట్టు తెలిపారు.




ప్రమోద్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న డిజిపి శివధర్‌రెడ్డి, పక్కన నిందితుడు

రియాజ్ ఆచూకీ తెలిపిన వారికి ప్రకటించిన రూ.50 వేల రివార్డు చెక్కును ఆసిఫ్ భార్య సబీనా బేగమ్‌కు అందజేశారు.

మావోయిస్టులు బయటకు రండి

మావోయిస్టుల్లో తెలంగాణ నుంచి సుమారు 65 మంది ఉన్నారని.. వారిలో నాయకత్వ స్థాయిలో సైతం పలువురు ఉన్నట్టు డిజిపి తెలిపారు. అడవిని విడిచి జన జీవన స్రవంతిలో కలవాలని, కేసుల విషయంలో సాను భూతితో ఉన్నామని, వేధింపులు ఏమీ ఉండబోవని భరోసా కల్పించారు. పోలీస్ ద్వారానైనా లేకుంటే మీడియా, రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకులు తదితర మార్గాల ద్వారా లొంగిపోవాలని సూచించారు. ప్రెస్‌మీట్‌లో సిపి సాయిచైతన్య, ఎసిపి తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిషన్ నోటీసులు

రియాజ్ ఎన్‌కౌంటర్‌పై.. మీడియాలో వచ్చిన కథనాలను సుమోటాగా స్వీకరించి మానవహక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనకు దారి తీసిన పరిస్థితులపై ఏదైనా మెజిస్ట్రేట్ జ్యుడిషియల్‌చే విచారణ చేయించి నివేదిక అందజేయాలని డిజిపిని ఆదేశించింది. ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం నివేదిక కాపీలను నవంబర్ 24వ తేదీలోపు అందజేయాలని సూచించింది. దీనిపై డిజిపి స్పందించి మెజిస్ట్రేట్‌తో విచారణ చేయిస్తున్నట్టు తెలిపారు.

కానిస్టేబుల్‌ను హత్యచేసిన నిందితుడు హతం

నిజామాబాద్‌లో సిసిఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్య చేసిన రియాజ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిందితుడు.. సోమవారం ఉదయం ఎఆర్ కానిస్టేబుల్ నుంచి గన్ లాక్కొని ఫైర్ చేసేందుకు యత్నించగా.. పోలీసులు ఆత్మరక్షణలో భాగంగా కాల్పులు జరపడంతో రియాజ్ మృతిచెందాడు. ఈ ఘటనపై సీపీ సాయిచైతన్య విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆసిఫ్ అనే వ్యక్తి నిందితుడు రియాజ్‌ను పట్టించాడు. ఈ సమయంలో ఇద్దరూ గాయపడటంతో.. ఆసిఫ్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. రియాజ్‌ను నిజామాబాద్ జిజిహెచ్‌లో ఖైదీ వార్డుకు తరలించారు. చికిత్స పొందుతున్న సమయంలో రియాజ్ ఆస్పత్రి అద్దాలను ధ్వంసం చేశాడు. రెగ్యూలర్ తనిఖీలలో భాగంగా అటుగా వచ్చిన ఎఆర్ పోలీసులు అతన్ని వారించారు. అదే సమయంలో ఎఆర్ కానిస్టేబుల్ నుంచి తుపాకీ లాక్కున్నాడు. దాన్ని ఇవ్వాలని చెబుతున్నా వినకుండా ట్రిగ్గర్ నొక్కి కాల్చేందుకు ప్రయత్నిస్తుండగా.. తప్పనిసరి పరిస్థితుల్లో ఆత్మరక్షణలో భాగంగా ఏఆర్ ఎస్ఐ కాల్పులు జరిపారు. దాంతో కింద పడిపోయిన రియాజ్ లేవకపోవడంతో వైద్యులు పరిశీలించి మృతిచెందినట్టు నిర్ధారించారు. దీనికి సంబంధించి కేసు విచారణలో ఉంది.

రియాజ్ మృతదేహానికి ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులు కుటుంబీకులకు అప్పగించారు. మంగళవారం తెల్లవారుజామున అంత్యక్రియలు పూర్తి చేయించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు

వర్షానికి తడిసిన ధాన్యం

- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. సోమవారం సిద్దిపేట పట్టణంలో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో మార్కెట్‌లో ఉన్న మొక్కజొన్న, వరి ధాన్యం తడిసి ముద్దయింది. చాలా రోజుల కిందటే మార్కెట్‌కు మొక్కజొన్నలు, ధాన్యం తెచ్చినప్పటికీ.. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం మొత్తం తడిసిపోయిందని రైతులు వాపోయారు. ఈ ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తేమశాతం తక్కువగా ఉన్నప్పటికీ కొందరు వ్యాపారులు కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు నామమాత్రంగా కొన్ని కుప్పలను మాత్రమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారని, మిగతా కుప్పలకు చాలా తక్కువ ధరకు ధరలను నిర్ణయిస్తున్నారని, దీంతో నష్టపోతున్నామని అంటున్నారు. ప్రభుత్వం వెంటనే మద్దతు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దుబ్బాక మండల పరిధిలోని రాజక్కపేట ఐకెపి సెంటర్లో పలువురు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టారు. సోమవారం వేకువజామున కురిసిన వర్షంతో ధాన్యం తడిసి నీటి పాలైంది. ఎలాంటి షరతులూ లేకుండా ధాన్యం అయినా ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పోలీసు సంక్షేమ నిధికి రూ. ఎనిమిది లక్షల విరాళం

- ఎలైట్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ట్రోఫీ విజేతగా పోలీస్ క్రికెట్ టీమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చామల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎలైట్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ట్రోఫీని పోలీస్ క్రికెట్ టీమ్ గెలుపొందింది. అక్టోబర్ 9, 10 తేదీల్లో ఉప్పల్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ టోర్నమెంట్ ఫైనల్ లో టాలీవుడ్ టీంపై పోలీస్ క్రికెట్ టీం విజేతగా నిలిచింది. విన్నర్ టీమ్‌కు లభించిన రూ.ఐదు లక్షలు, రన్నర్ టీమ్‌కు రూ.మూడు లక్షల నగదు బహుమతిని పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకొని పోలీసు సంక్షేమ నిధికి ఇవ్వాలని నిర్ణయించారు. ఈ చెక్కును రాష్ట్ర ప్రభుత్వ హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సివి ఆనంద్‌కు మంగళవారం సచివాలయంలో నిర్వాహకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ క్రికెట్ టీమ్ సభ్యులతో పాటు, బిసిసిఐ, ప్రణవ గ్రూప్ ప్రతినిధులు పాల్గొనున్నారు.



మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

జూబ్లీహిల్స్ బైపోల్... 150కి పైగా నామినేషన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల గడువు మంగళవారంతో ముగిసింది. మొత్తం 150కి పైగా నామినేషన్లు దాఖలయ్యాయి. బిజెపి అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్రులు, రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) బాధిత రైతులు, ఓయూ, నిరుద్యోగ సంఘాల నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు. 3 గంటల తర్వాత నుంచి గేటు లోపల ఉన్నవారికే నామినేషన్ వేసేందుకు అనుతిస్తున్నారు. అక్టోబర్ 24 వరకు నామినేషన్ల ను ఉపసంహరించుకునేందుకు గడువు ఉంది. నవంబర్ 11న పోలింగ్ నిర్వహించనున్నారు.

24న గార్లలో పంచాయతీ కార్మికుల బహిరంగ సభ

- 24, 25 తేదీల్లో గ్రామపంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ రాష్ట్ర ఐదో మహాసభ
- వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్,వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ఐదో మహాసభ ఈ నెల 24,25 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా గార్లలో జరుగనుందని, 24న పంచాయతీ కార్మికులతో బహిరంగ సభ ఉంటుందని ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాల యంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ, వి.ఎస్. రావు, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు, వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల గణపతిరెడ్డి, మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ మహాసభ సందర్భంగా 24న గార్లలో ఉదయం 11 గంటల కు భారీ ప్రదర్శన- బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల పర్మినెంట్, పంచాయతీ సిబ్బందిని రెండో పిఆర్‌సి పరిధిలోకి తీసుకొని కనీసం వేతనం రూ.26 వేలు అమలు చేయడం, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, ఇఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్ అమలు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయ బోతున్నామని తెలిపారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు, వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల గణపతిరెడ్డి, రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తున్నా పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి కార్మికులందర్నీ పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతినెల గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల ఖాతాల్లో ఐదో తేదీలోగా వేతనాలు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో ఎక్కని కార్మికులను నమోదు చేయాలని కోరారు. కార్మికులు మరణిస్తే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు.

దీపావళి ప్రతి ఒక్కరికి వెలుగులు నింపాలి

- మహేశ్‌కుమార్ గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దీపావళి ప్రతి కుటుంబంలో వెలుగులు నింపాలని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆకాంక్షించారు. చీకటిని తరిమికొట్టేందుకు, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి చిహ్నంగా ప్రజలు తమ ఇళ్ల వెలుపల మట్టి దీపాలను (దియాలు) వెలిగిస్తారని అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్‌ను టిపిసిసి ప్రధాన కార్యదర్శి నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కష్ణగౌడ్, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పార్టీల నిబంధనలు పాటించాలి

- ప్రకటనలకు సంబంధించి ముందస్తు అనుమతి తీసుకోవాలి
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిలో పోటీలో ఉన్న రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధనలు విధిగా పాటించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సభల అనుమతి, ప్రచారం వ్యయాలను సమర్పించాలని సూచించారు. పోలింగ్ రోజు లేదా దానికి ముందురోజు పత్రికల్లో రాజకీయ ప్రకటనలు ప్రచురించడానికి తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, మీడియా సంస్థలు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు. ఓటర్లను ప్రభావితం చేసే తప్పుడు, మభ్యపెట్టే లేదా నిర్ధారణ లేని ప్రకటనలను ప్రచారం చేయరాదన్నారు. ప్రకటనలను ప్రచురించే ముందు కనీసం రెండు రోజుల ముందుగానే ఎంసిఎంసికి దరఖాస్తు చేయాలని, తద్వారా సమీక్షకు తగిన సమయం లభిస్తుందని వివరించారు. రాష్ట్ర, జిల్లా స్థాయి ఎంసిఎంసి కమిటీలు ఇప్పటికే క్రియాశీలంగా పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉందని, ప్రచారం, వ్యయం, ప్రకటనల విషయంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. ఉల్లంఘన జరిగితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వేచ్ఛగా, ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని సుధర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

'నేతకాని'ల ప్రత్యేక పండుగ దీపావళి బతుకమ్మ

- సీతంపేటలో మూడ్రోజుల ఉత్సవాలు
- నేడు జోడెద్దుల ప్రతిమల నిమజ్జనం
- రేపు దీపావళి బతుకమ్మ వేడుకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల పరిధి సీతంపేట గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. దీపావళి రోజు బతుకమ్మ ఆడటం అక్కడి నేతకాని సామాజిక తరగతి ప్రత్యేకత. దీపావళి పండుగ రోజు బతుకమ్మ ఆడటం ఇక్కడ పూర్వం నుంచి వస్తున్న ఆచారం. మూడ్రోజుల పాటు జరిగే ఈ బతుకమ్మ వేడుకలకు గ్రామ నేతకానీలు ఎక్కడ స్థిరపడ్డా పండుగ రోజు గ్రామానికి చేరుకుంటారు. మంగళవారం కేదారీశ్వరస్వామి వ్రతంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలలో భాగంగా పురుషులు ఊరు శివారులోని కుంట బంక మట్టితో ప్రతిమలు తయారు చేస్తారు. ఇంట్లో రకరకాల పిండి వంటలతో తయారు చేసిన నగలు (నాగళి, కోల, దుత్తలు, గొడుగు) వంటి వ్యవసాయ పనిముట్లను జోడెద్దులకు అలంకరించి కుటుంబ సభ్యులంతా కలిసి కేదారీశ్వరస్వామి వ్రతం పూర్తి చేశారు. నేడు(బుధవారం) మగవారు మాత్రమే ప్రత్యేకంగా అలంకరించిన నగలతో కూడిన జోడెద్దుల ప్రతిమలను తీసుకొని కోలాటాలతో ఊరేగింపుగా వెళ్లి ఊరు శివారులోని కుంటలో నిమజ్జనం చేస్తారు. గురువారం మహిళలు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మను ఊరు శివారులోని చెరువులో వదులుతారు. దీంతో మూడ్రోజుల దీపావళి బతుకమ్మ పండుగ ముగుస్తుంది.

ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి
జాడి రాజీవ్‌గాంధీ, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు

నేతకాని సామాజిక తరగతి వారి 'దీపావళి' బతుకమ్మ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఎస్సీ సామాజిక తరగతికి చెందిన నేతకాని కులస్తులు జరుపుకునే ఈ పండుగకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

నేతకానీల ప్రత్యేక పండుగ
చొక్కం ఉప్పలయ్య (నేతకాని కుల సంఘం పెద్ద మనిషి)

మహారాష్ట్ర రాష్ట్రం నుంచి వలస వచ్చిన నేతకాని కులస్తులం. మేమంతా మూడ్రోజుల పాటు దీపావళి బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం. ఒక్క సీతంపేటలోనే జరుపుకునే నేతకానీల ప్రత్యేక ఈ దీపావళి బతుకమ్మ వేడుకలను దేశం నలుమూలల చాటిచెప్పాలని మా ఆరాటం. దీనికి ప్రభుత్వం కూడా సహకారం అందించాలి.



పంచముఖ ఆంజనేయ స్వామిని సందర్శించిన విధుశేఖర భారతీ

ప్రజాశక్తి కల్చరల్

శృంగేరీ శారదా పీఠం విధుశేఖర భారతీ స్వామి తమ విజయ యాత్ర లో భాగంగా మంగళవారం అర్ టి సి క్రాస్ రోడ్డు వద్దనున్న పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం సందర్శించి పూజాదికాలు నిర్వర్తించారు ఆలయ ధర్మాధికారి కళా జనార్ధన మూర్తి స్వామి వారికి అర్చకులు వేదమంత్రోచ్చారణ ల మధ్య స్వాగతం పలికారు తదుపరి ముషీరాబాద్ వద్ద నున్న జ్ఞాన సరస్వతీ దేవాలయం ను కూడా స్వామి దర్శించారు అక్కడ కూడా ఆలయ ధర్మాధికారి ఇన కళా జనార్ధన మూర్తి స్వాగతం పలికారు ఆలయ మానేజర్ బండి శ్రీనివాస్ పాల్గొన్నారు ఈ పర్యటన అంతా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ అతిథిగా వై ప్లస్ కాటగిరి భద్రత మధ్య జరిగింది.

తలండి శ్రావణిది కుల దురహంకార హత్యే

- నిందితులను కఠినంగా శిక్షించాలి : టిఎజిఎస్, కెవిపిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తలండి శ్రావణి హత్య.. కుల దురహంకార హత్యేనని, హత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదివాసి గిరిజన సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు టిఎజిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిడియం బాబూరావు, పూసం సచిన్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలంలోని గెర్రే గ్రామంలో శివార్ల సత్తయ్య కొడుకు కులం తక్కువ అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడని కక్షపూరితంగా ఇంట్లో ఎవరు లేని సమయంలో కోడలు శ్రావణిపై దాడి చేసి కిరాతకంగా హత్య చేశాడని తెలిపారు. ఈ హత్యను కుల దురాహంకార హత్యగా భావిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సత్తయ్య కుటుంబ ఉంటున్న స్థలం ప్రభుత్వ స్థలమని, దీనిని శ్రావణి కుటుంబానికి ఇవ్వాలని గ్రామస్తులు సూచించారని తెలిపారు.

రియాజ్ ఎన్‌కౌంటర్‌పై టిజిహెచ్‌ఆర్‌సి కేసు నమోదు

- నవంబర్ 24లోగా నివేదిక అందించాలని డిజిపికి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలీస్ కాల్పుల్లో మృతి చెందిన నిజామాబాద్ వాసి షేక్ రియాజ్ ఎన్‌కౌంటర్‌పై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టిజిహెచ్‌ఆర్‌సి) సుమోటోగా కేసు నమోదు చేసింది. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సుప్రీంకోర్టు, జాతీయ మానవ హక్కుల కమిషన్ మార్గదర్శకాల మేరకు విచారణ చేయనున్నట్టు టిజిహెచ్‌ఆర్‌సి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. సంఘటనకు దారితీసిన పరిస్థితులు, మెజిస్టీరియల్ లేదా జ్యుడీషియల్ విచారణ స్థితి, పోస్ట్‌మార్టం నివేదిక కాపీలతో సహా ఎన్‌కౌంటర్‌పై పూర్తి నివేదికను నవంబర్ 24లోగా సమర్పించాలని తెలంగాణ డిజిపిని ఆదేశించింది. పోలీస్ కానిస్టేబుల్ ఎం.ప్రమోద్ కుమార్ హత్యకు సంబంధించి మృతుడిని ఇటీవల అరెస్టు చేసి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న క్రమంలో మృతుడు సాయుధ రిజర్వ్ కానిస్టేబుల్ సర్వీస్ ఆయుధాన్ని లాక్కునేందుకు ప్రయత్నించాడని, ఆ తర్వాతే తాము కాల్పులు జరిపామని పోలీసులు ప్రకటించిన విషయం విదితమే.

ప్రతి ఇంటా ఓ వైద్యుడు!

- వైద్య వృత్తికి కేరాఫ్ అడ్రస్‌గా మోత్కులగూడెం..
- సుమారు 35 మంది డాక్టర్లుగా స్థిరపడిన వైనం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'పట్టుదల ఉంటే దేన్నైనా సాధించొచ్చు' అని నిరూపిస్తున్నారు ఆ పల్లె యువత. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఓ మారుమూల వ్యవసాయ ఆధారిత గ్రామం నేడు వైద్య వృత్తికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట మండలం మోత్కులగూడెం నుంచి సుమారు 35 మంది యువత ఎంబిబిఎస్ డాక్టర్లు అయ్యారు. మరికొందరు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని చూసి, తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదువుతున్న ఈ గ్రామం పిల్లలు.. వైద్య వృత్తికి వన్నె తెస్తున్నారు. ఈ కారణంగానే మోత్కులగూడెంను పరిసర ప్రాంతాల ప్రజలు ముద్దుగా 'డాక్టర్ల గూడెం' అని పిలుచుకుంటున్నారు. జమ్మికుంట పట్టణానికి అతి చేరువలో ఉన్న గ్రామం మోత్కులగూడెం.. పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. సుమారు 6వేల జనాభా ఉన్న ఈ చిన్న గ్రామం ప్రస్తుతం ఎంబిబిఎస్ డాక్టర్ల నిలయమైంది. ప్రతి ఏటా నీట్ పరీక్షల్లో ఈ గ్రామం నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ఎంబిబిఎస్ సీట్లు సాధిస్తున్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో కూడా చాలామంది సీట్లు సాధించారు. ఇప్పటివరకు సుమారు 35 మంది డాక్టర్లు తయారయ్యారు. ఇందులో ఇప్పటికే ఎంబిబిఎస్ పూర్తి చేసి వైద్య సేవలు అందిస్తున్న వారు, ఎంబిబిఎస్, ఆపై ఉన్నత చదువులు అభ్యసిస్తున్న వారు ఉన్నారు.

పేదలకు సేవ.. గ్రామానికే గర్వకారణం

మోత్కులగూడెం బిడ్డలు డాక్టర్లు అయ్యి, తమ గ్రామానికి, ప్రాంతానికి సేవలు అందించడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన డాక్టర్ కిషోర్ కామిశెట్టి (ఎండి పల్మనాలజీ), డాక్టర్ ఉడుగుల సురేష్ (ఎంబిబిఎస్, ఎండి అనస్థీషియా, ఎండి జనరల్ ఫిజీషియన్), డాక్టర్ ఉడుగుల అనిత జమ్మికుంట పట్టణంలో సంజీవని ఆస్పత్రిని నడుపుతున్నారు. అలాగే, ప్రముఖ డాక్టర్ ఆకుల శ్రీనివాస్ (ఎండి జనరల్ ఫిజిషియన్) ఆదిత్య ఆస్పత్రిని స్థాపించి సేవలందిస్తున్నారు.

మోతుకుల గూడెంకే గర్వకారణం
డాక్టర్ ఉడుగుల సురేష్

మోత్కుల గూడెంలో సుమారు 35 మంది ఎంబిబిఎస్ డాక్టర్ సీటు సాధించడం చాలా గర్వకారణం. నేను గోల్డ్ మెడల్ సాధించాను. ప్రస్తుతం సంజీవని ఆస్పత్రిని స్థాపించి, పేదలకు సేవలు అందించడంలో ఎంతో సంతృప్తిగా ఉంది.

చాలా ఆనందంగా ఉంది..
డాక్టర్ కిషోర్ కుమార్ కామిశెట్టి, ఎండి పల్మనాలజీ

ఎక్కువ సంఖ్యలో ఎంబిబిఎస్ సీట్లు సాధించి, వైద్య వృత్తిలో ప్రవేశించడం చాలా ఆనందకరం. నేను తక్కువ ఫీజుతో కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నాను. కొత్తగా ఎంబిబిఎస్ సీటు సాధించినవారు గ్రామాభివృద్ధికి, సమాజ ఆరోగ్యానికి తోడ్పడాలి.

పేదలకు వైద్యాన్ని అందించడమే లక్ష్యం
డాక్టర్ ఆకుల శ్రీనివాస్

వైద్య వృత్తి ఎంతో గొప్పది. చిన్నప్పటి నుంచే సమాజ సేవ చేయాలన్న సంకల్పంతో కష్టపడి డాక్టర్ అయ్యాను. ఈ చిన్న గ్రామంలో సుమారు 35 మంది ఎంబిబిఎస్ సీట్లు సాధించడం గొప్ప విషయం. పేదలను దృష్టిలో పెట్టుకొని వైద్యాన్ని అందించడమే నా లక్ష్యం.

తల్లిదండ్రుల కష్టాన్ని చూసి చదివాను
ఏబూసి అశ్విత (నీట్ సీటు సాధించిన విద్యార్థిని)

మా తల్లిదండ్రుల కష్టాన్ని చూసి కష్టపడి చదివి ఎంబిబిఎస్ సీటు సాధించాను. నేను ప్రభుత్వ పాఠశాలలోనే చదివాను. డాక్టర్ అయి సమాజంలోని పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే సంకల్పం ఉంది.

"తెలంగాణ రైజింగ్ - 2047 " సిటిజన్స్ మూడు లక్షల మంది

- 25తో ముగియనున్న సర్వే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన "తెలంగాణ రైజింగ్ - 2047 " సిటిజన్ సర్వేకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వేలో కేవలం తెలంగాణ వివిధ ప్రాంతాల నుంచి దాదాపు మూడు లక్షలకుపైగా పౌరులు పాల్గొని తమ విలువైన సూచనలు అందచేశారు. భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుంచి సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ - 2047 " సిటిజన్ సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీతో ముగుస్తుంది. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందు బాటులో ఉన్నందున www.telangana.gov.in /telanga-narising అనే వెబ్‌సైట్‌లో సందర్శించి తమ సలహాలు సూచనలను అందించాల్సింగా ఒక అధికార ప్రకటనలో కోరారు.

కెసిఆర్ మళ్లీ వస్తారు.. మీకు ఇళ్లూ వస్తాయి

- మూసీ, హైడ్రా బాధితులతో కెటిఆర్, హరీశ్‌రావు
- వారితో కలిసి దీపావళి వేడుకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"మరో రెండేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది.. కెసిఆర్ మళ్లీ సిఎంగా వస్తారు.. అప్పుడు మూసీ, హైడ్రా బాధితులకు ఇళు ఇస్తాం" అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్-ఎమ్మెల్యే కెటిఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. వారు మూసీ, హైడ్రా బాధితులతో కలిసి సోమవారం దీపావళి వేడుకలు జరుపుకున్నారు. రంగారెడ్డి జిల్లా మాదాపూర్ సున్నం చెరువు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న హైడ్రా బాధితులను కెటిఆర్ పరామర్శించి స్వీట్లు, టపాసులు పంపిణీ చేశారు.

అలాగే, గండిపేట మండలం హైదర్‌షాకోట్‌లో మూసీ సుందీరకరణలో భాగంగా ఇండ్లు కోల్పోయిన బాధితులతో కలిసి హరీశ్‌రావు దీపావళి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దీపావళి అంటేనే నరకాసుర వధ అని, నరకాసుర వంటి కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న రోజుల్లో అంతమవుతుందని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇళ్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్.. కొత్తగా ఇండ్లు ఇవ్వకపోగా ఉన్నవే కూలుస్తోందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలన పట్ల ప్రజల్లో తిరుగుబాటు మొదలయిందన్నారు. హైదరాబాద్‌లో కెసిఆర్ లక్ష ఇళ్లు కట్టారని, ఇందులో తాము 60 వేల ఇళ్లు పంపిణీ చేశామని చెప్పారు. మిగిలిన 40 వేల ఇళ్లు అలాగే ఉన్నాయని, వాటిని పేదలకు పంపిణీ చేయాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. మూసీ సుందరీకరణకు గతంలోనే కెసిఆర్ ప్రణాళికలు రూపొందించారని గుర్తు చేశారు. రేవంత్ సర్కార్ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చడం దారుణమన్నారు. హైడ్రా కమిషనర్‌కు రేవంత్‌రెడ్డి సోదరుడి ఇళ్లు, పొంగులేటి, మహేందర్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.